పేరుకే పవర్.. పెత్తనమంతా పచ్చనేతలదే

- సర్పంచ్ అధికారాలను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- తీర్మానం లేకుండానే గ్రామాల్లో పనులు
- అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే..
- సర్పంచ్‌ల అసహనం



ఉమ్మాయపల్లెలో సర్పంచ్ ప్రమేయం లేకుండా నిర్మించిన సీసీరోడ్డు

కొలిమిగుండ్ల: గ్రామ పంచాయతీలో సర్పంచ్‌లకు ఉన్న అధికారాలను కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. గ్రామ మొదటి పౌరుడైన సర్పంచ్ సంతకానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా తప్పక పంచాయతీ తీర్మాణం చేశాకే పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌ల అధికారాలకు చెక్‌పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగ బద్ధంగా ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు గ్రామ పరిపాలనతో సంబంధం లేకుండా పూర్తిగా పక్కన పెట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులతో అక్టోబర్ 14–20 వరకు గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కూటమి నాయకుల కనుసన్నల్లోనే పనులను గుర్తించారు. ఈ పనుల్లో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే పనులను వారే ఎంపిక చేసుకున్నారు. గ్రామాభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ భాగం వైఎస్సార్‌సీపీ మద్దతు సర్పంచ్‌లే ఉండడంతో ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తున్నారు.

పనుల గుర్తింపులో ఇష్టారాజ్యం

గ్రామాల్లో పనులు చేపట్టాలంటే సర్పంచ్ అధ్యక్షతన వార్డు సభ్యులు సమావేశమై అందరి అభిప్రాయాలు తీసుకుని మెజార్టీ సభ్యుల అంగీకారంతో పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. పల్లె పండుగ పనుల్లో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే సీసీ రోడ్లు వేయాలనే నిర్ణయాధికారం కూటమి నాయకుల చేతుల్లోకి వెళ్లిపోయింది. కొన్ని చోట్ల జనవాసాలు లేని చోట్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం చేసేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.23.40 కోట్ల నిధులు మంజూరు చేశారు. సంక్రాంతిలోగా ఈ పనులు పూర్తి చేయాలని టార్గెట్ పెట్టారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పనులు మొదలవ్వగా చాలా చోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. కొన్ని చోట్ల కూటమి నాయకుల మధ్య పోటీ నెలకొనడంతో నిర్మాణ పనులు ఆలస్యమవుతున్నాయని తెలుస్తోంది.

నియోజకవర్గంలో మండలాల వారీగా పనుల వివరాలు

మండలం	పనులు	నిధులు కోట్లల్లో
కొలిమిగుండ్ల	26	రూ.3.25
అవుకు	29	రూ.3.50
సంజామల	29	రూ.4.35
కోవెలకుంట్ల	24	రూ.4.90
బనగానపల్లె	39	రూ.7.40

సర్పంచ్‌లను అవమానించడం తగదు



గ్రామాల్లో సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే పను లు చేపట్టడం పూర్తిగా అవమానించడమే. కనీసం తీ ర్మానాలు తీసుకోకుండా చేస్తున్నారు. ఇష్టమొచ్చిన ట్లు చేయడం సరికాదు. సర్పంచ్ విధులను ఇతరు లు ఉపయోగించడం బాధాకరం. అభివృద్ధి పనులు చేయడం మంచి పరిణామమే. అయితే సర్పంచ్‌లను పక్కన పెట్టడం మంచి సాంప్రదాయం కాదు. –లాయర్ మహేశ్వరరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

లోక్ అదాలత్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం



న్యాయవాదులతో సమావేశమైన జడ్జిలు

డోన్ టౌన్: లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయవాదులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, కర్నూలు ఫోర్త్ కోర్ట్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజమ్మ అన్నారు. ఈ నెల 14వ తేదీ జరిగే మెగా జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. కక్షిదారులతో సంప్రదించి రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. డోన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు నాగభూషణరెడ్డి, నరసింహులు, గోపాల్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రాగులరాముడు, కుమారి, యోగానందరెడ్డి, నాగరాజు, మద్దయ్య, హరి, రవికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్టించిన నూతన విగ్రహం

కొలిమిగుండ్ల: కోర్నపల్లె గుండం ఆంజనేయ స్వామి ఆలయ పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న ఆలయంలో శనివారం పట్టాభిరాముడి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. కొద్ది రోజుల క్రితం ఆళ్లగడ్డకు చెందిన శిల్పకళాకారులు విగ్రహాన్ని తయారు చేసి వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ట చేశారు. అయితే విగ్రహం కొంత భాగం శిథిలం అయింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు వాటి స్థానంలో గతంలో మాదిరిగానే ఉండే విగ్రహాన్ని తయారు చేయించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి విగ్రహాన్ని ప్రతిష్ట చేయించారు. ఇటిక్యాల బాలిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీమా చెల్లించాలి

కోవెలకుంట్ల: 2024–25 రబీ సీజన్‌లో సాగు చేసిన ఉద్యానవన పంటలకు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి సూచించారు. మామిడి తోటలకు వాతావరణ ఆధారిత బీమా వర్తింపునకు ఎకరా రూ. 2,250 ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం సంభవిస్తే ఎకరాకు రూ. 45వేలు నష్టపరిహారం వర్తిస్తుందన్నారు. అలాగే ఉల్లి పంటకు ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకం ద్వారా ఎకరాకు రూ. 225 ప్రీమియం చెల్లిస్తే రూ. 1,12,500 బీమా వర్తిస్తుందని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకుని బ్యాంకులు, కామన్ సర్వీస్‌సెంటర్లు, మీసేవా, బీమా కంపెనీ నియమించిన ప్రతినిధుల వద్ద ఈ నెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా నాగరాజు

డోన్ టౌన్: సీపీఎం మండల కార్యదర్శిగా కొయిలకొండ నాగరాజుతో పా టు కమిటీ సభ్యులుగా మరో 11 మందిని ఎన్ను కున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏ.నాగరాజు, జిల్లా కమిటీ సభ్యుడు నక్కి శ్రీకాంత్ తెలిపారు. రెండు రోజులుగా జరుగుతున్న మండల 3వ మహాసభల్లో భాగంగా శనివారం నూతన కమి టీని ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు శివరామ్, రామాంజనేయులు, భాస్కర్‌రెడ్డి నాగన్న పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం రావడం హర్షనీయం

డోన్ టౌన్: డోన్‌కు కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడం హర్షనీయమని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. సెంట్రల్ స్కూల్ ద్వారా ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి తీగల అపహరణ

ప్యాపిలి: మండల పరిధిలోని పెద్దపొదిళ్ల రహదారిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేశారు. వ్యవసాయ విద్యుత్‌కు సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను దిమ్మెపై నుంచి కింద పడేశారు. ధ్వంసం చేసి వాటిలో ఉన్న కాపర్ వైండింగ్ వైర్‌ను అపహరించుకుని వెళ్లారు. విషయం తెలుసుకున్న ఏఈ వినయ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు ఏఈ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిన్నారికి గాయాలు

బేతంచెర్ల: పాఠశాల వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటన శనివారం మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మధనగోపాల్, విజయ లక్ష్మి దంపతుల కుమార్తె మధులౌక్య స్థానిక పాణ్యం సిమెంట్ ఎయిడెడ్ స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. శనివారం మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటే క్రమంలో నంద్యాల నుంచి బేతంచెర్ల వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. చిన్నారికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అదే కారులో బేతంచెర్ల శేషారెడ్డి వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

- పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో డీఈఓ జనార్దన్ రెడ్డి



రాచర్లలో మాట్లాడుతున్న డీఈఓ జనార్దన్ రెడ్డి

ప్యాపిలి: పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాల్సింది తల్లిదండ్రులే అని డీఈఓ జనార్దన్ రెడ్డి అన్నారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా మండల పరిధిలోని రాచర్ల, జలదుర్గం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో డీఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి డీఈఓ మాట్లాడారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి విషయాన్ని విద్యార్థులు పాటించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య చాలా అవసరం అన్నారు. తల్లిదండ్రులు కూడా ఇళ్లలో పిల్లలకు మహనీయుల జీవిత చరిత్రల గురించి వివరించాలన్నారు. సెల్‌ఫోన్లలో పిల్లలు ఎలాంటి వీడియోలు చూస్తున్నారో గమనిస్తుండాలని తెలిపారు. ఒంటరిగా గదిలో పిల్లలు మొబైల్ చూడకుండా నియంత్రించాలన్నారు. సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలను ఉపాధ్యాయులు తరచూ వివరిస్తూ ఉండాలన్నారు. కాగా ప్యాపిలి బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీటీఎం సమావేశంలో తహసీల్దార్ భారతి, ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలలో సీఈఓ వెంకటరామిరెడ్డి, బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వెంగళాంపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈఓ వెంకటేశ్ నాయక్, కేజీబీవీలో ఈఓఆర్డీ బాలకృష్ణుడు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడు మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ పాత బస్టాండులో బాషా (62) అనే అనాథ వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. కొంత కాలంగా బేతంచెర్ల రైల్వేస్టేషన్‌ల్ వద్ద ఉంటూ పాత పేపర్లు ఏరుకుని వాటి ద్వారా వచ్చే నగదుతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి గ్రామంలోని ఓ ఆటోలో మృతిచెంది ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

మద్యం విక్రేతల అరెస్ట్



కారు, మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

డోన్ రూరల్: మండల పరిధిలోని తాటిమాన్‌కొత్తూరు గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సీఎం రాకేష్ తెలిపారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న సోమశేఖర్‌గౌడ్, డోన్ వైఎస్ నగర్ కాలనీకి చెందిన ఈడిగ సురేంద్రగౌడ్ కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి కారులో మద్యం తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరి వద్ద నుంచి 20 టెట్రా ప్యాకెట్ బాక్స్‌లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు, విక్రేత అరెస్ట్‌ను చూపిస్తున్న పోలీసులు

కోవెలకుంట్ల: అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని శనివారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడుకు చెందిన ఖాదర్‌బాషా బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయించేందుకు కోవెలకుంట్ల నుంచి మద్యం తీసుకెళుతుండగా సమాచారం మేరకు దాడి చేశామన్నారు. అతని వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో శనివారం విద్యుదాఘాతానికి ఎద్దు మృతి చెందింది. గ్రామంలోని పబ్లిక్ కుళాయివద్ద సర్వీస్ వైరు తగలడంతో కృష్ణమూర్తికి చెందిన ఎద్దు షాక్‌కు గురై మృతి చెందింది. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రూ.80 వేల విలువ చేసే తన ఎద్దు మృతిచెందిందని బాధితుడు వాపోయాడు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

బనగానపల్లె రూరల్: పెండేకంటినగర్‌లోని శ్రీధాత్రి స్కూల్‌లో ఉపాధ్యాయుడు ధ్రువకుమార్ విద్యార్థుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సమీర్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ డీలర్లపై ఫిర్యాదు

డోన్ రూరల్: రేషన్ దుకాణాల్లో బియ్యాన్ని తక్కువ తూకం వేస్తూ మోసం చేస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, పట్టణ కార్యదర్శి మోటారాముడు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కె.నాగమణికి వినతి పత్రం అందించారు. కొందరు డీలర్లు డబ్బాలు పెట్టి తూకాలు వేస్తున్నారని, దీని వల్ల రెండు మూడు కేజీల బియ్యం తేడా వస్తున్నాయని తెలిపారు. అవకతవకలకు పాల్పడుతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ

డోన్: ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ప్రార్థన సమయం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ డాక్టర్ సుందర్‌సింగ్ కాలనీలోని నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. తన కుమారుడు ప్రమోద్‌కుమార్ ఆర్థిక సహాయంతో 10 మంది మహిళలకు చీర, జాకెట్, లంగా తదితర నూతన వస్త్రాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

కష్టపడితేనే ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ రాజకుమారి
- ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం



బేతంచెర్ల: విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

బేతంచెర్ల: క్రమశిక్షణ, ప్రణాళికతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్‌కు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తల్లి మొదటి గురువు అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని చెప్పారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ఉంచుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా బాగా చదువుకుని మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను గుర్తించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. పాఠశాల ప్రహరీతో పాటు మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు, హెచ్ఎం మల్లికార్జున, సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, వైస్ ఎంపీపీ వెంకటలక్ష్మమ్మ, ఎంపీటీసీ నాగశేషు, ఎల్ల నాగయ్య, విద్యా కమిటీ చైర్మన్ వెంకటరమణ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ హరి ప్రసాద్, సీఐ వెంకటేశ్వరరావు, హెచ్ఎం అబ్రహ్మం పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే చదివా

తాను కూడా జెడ్పీ హైస్కూల్‌లోనే చదువుకున్నట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం నర్సింగపల్లె పంచాయతీ కొల్లివలస గ్రామంలో సామాన్య వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానన్నారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పిన మార్గంలో నడవడం వల్లే కలెక్టర్‌గా మీ ముందుకు వచ్చానన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఆడ, మగ తేడా చూపించకుండా ఇద్దరిని సమానంగా చదివించాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కోవెలకుంట్ల: విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ సూచించారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్‌మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పట్టణ శివారులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి సీఐతోపాటు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి, ఎంఈఓ వెంకట్రామిరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

కొలిమిగుండ్ల: మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తం 59 ఉన్నాయి. ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సమావేశానికి తల్లితండ్రులు కొంత వరకు బాగానే వచ్చినా, ప్రాథమిక పాఠశాలల్లో చాలా చోట్ల తక్కువగా వచ్చారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో నామమాత్రంగా నిర్వహించాల్సి వచ్చింది. తల్లితండ్రులు పాఠశాల ఆవరణాల్లో ముగ్గులు వేశారు.

విద్యతో సమాజంలో గుర్తింపు

డోన్: బాగా చదువుకుంటే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని.. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక జ్యోతిరావుపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పేరెంట్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ బడులకు కొత్త రూపును తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ వసుంధరదేవి, కౌన్సిలర్ నాగేంద్ర, ఎద్దుపెంట సర్పంచ్ బంగారు జయచంద్ర పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి వారికి బంగారు భవిష్యత్తు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు కుమారుబా బు,రంగారెడ్డి, రామచంద్రారెడ్డి, మధు పాల్గొన్నారు.

సంజామల: స్థానిక కేజీబీవీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ సాల్మన్, ప్రిన్సిపాల్ శ్రీలేఖ, పేరుసోముల జెడ్పీహెచ్ఎస్‌లో ఎంఈఓ ఈశ్వరయ్య, హెడ్‌మాస్టర్ సీతరావమ్మ, ఎస్ఐ రమణయ్య పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేస్తున్న తల్లులు, విద్యార్థులు



డోన్: మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి



కోవెలకుంట్ల: మాట్లాడుతున్న సీఐ హనుమంతునాయక్

విద్యతో పేదరిక నిర్మూలన



పాతబస్టాండ్ వద్ద మాట్లాడుతున్న శ్రీరాములు

డోన్: పేదరికం పారద్రోలేందుకు విద్యే సరైన ఆయుధమని భావించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసిందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మాజీ మంత్రి బుగ్గన కృషితో డోన్‌కు కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడంతో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టణంలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, నాగభూషణంరెడ్డి, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, సోమేష్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, నాగేంద్ర, సుమలత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని యనకండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మద్దిలేటిగౌడ్(80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి యనకండ్ల గ్రామానికి వెళ్లి మద్దిలేటిగౌడ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, నొస్సం సాంబశివారెడ్డి ఉన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

కోవెలకుంట్ల: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఏపీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. శనివారం కోవెలకుంట్లకు వచ్చిన సందర్భంగా తాలుకా ఎన్‌జీఓ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పీఆర్‌సీకి కొత్త కమిషనర్ నియామకం, ఉద్యోగుల పీఆర్‌సీ విడుదల, పెండింగ్ డీఏలు, ఇతర బకాయిల చెల్లింపు, తదితర సమస్యలను ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు మునిస్వామి, కార్యదర్శి అబ్దుల్ వాజిద్ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి ఉద్యోగుల సమస్యలను వివరిస్తామని శివారెడ్డి తెలిపారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ఎన్‌జీఓ అసోసియేట్ అధ్యక్షుడు దస్తగిరి, ఉపాధ్యక్షుడు యాదాద్రి, సుధాకరయ్య పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే కఠిన చర్యలు

అవుకు: నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌దాస్ హెచ్చరించారు. శనిఅవుకు మండలం కొండమనాయునిపల్లెలో మర్రికుంట తండాకు చెందిన తులసినాయక్ ద్విచక్ర వాహనంపై సారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అలాగే కొండమనాయునిపల్లె చెరువు వద్ద సారా బట్టీలను ధ్వంసం చేసి 75 లీటర్ల బెల్లం ఊటను పారబోశారు. కొలిమిగుండ్లలో గంగయ్య, ఆది నుంచి 220 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.